భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 31.0

కనిష్ఠం : 24.0

ప్రైవేటు బస్సులపై కొరడా



ఏలూరులో తనిఖీలు

- రవాణా శాఖ అధికారుల విస్తృత తనిఖీలు
- ఏలూరులో 55, పశ్చిమలో 8 బస్సులపై కేసులు.. మూడు సీజ్
- నిబంధనలు మీరితే చర్యలు : జిల్లా రవాణా శాఖ అధికారి

భీమవరం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):కర్నూలులో వేమూరి కావేరి బస్సు అగ్ని ప్రమాదానికి గురై 19 మంది మరణించిన ఘటనతో రవాణా శాఖ అధికారులు కళ్లు తెరిచారు. రోజూ జిల్లా మీదుగా వందలాది బస్సులు దూరప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ సమయంలో అసలు బస్సులకు ఫిట్‌నెస్ ఉందా ? డ్రైవర్‌కు లైసెన్స్ ఉందా ? బీమా, పొల్యూషన్ మొదలైన పత్రాలు ఉన్నాయా ? అనేది పరిశీలించాలి. బస్సుల్లో చాలా వరకు ఫిట్‌నెస్‌లు లేకుండానే తిరుగుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు తనిఖీలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో



భీమవరంలో తనిఖీలు

ప్రైవేటు ట్రావెల్ బస్సులపై శనివారం తెల్లవారుజాము నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగించారు. జంగారెడ్డిగూడెం, ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు వద్ద, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం తదితర ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారులు ప్రతి బస్సును ఆపి రికార్డుల ప్రకారం ఇంజన్, చాసిస్, రిజిస్ట్రేషన్ నంబర్లను పరిశీలించారు. డోర్ సెన్సర్ల పనితీరు, అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలను ఆర్పడానికి అవసరమైన పరికరాలు ఉన్నాయో లేదో తెలుసుకున్నారు. ఏలూరు జిల్లాలో నిబంధనలను ఉల్లంఘించిన 55 బస్సుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. మూడు బస్సులను సీజ్ చేశారు. మొత్తం రూ.2.8 లక్షల జరిమానా విధించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఎనిమిది బస్సులపై కేసులు నమోదు చేశారు.

ఎనిమిది బస్సులపై కేసులు

పశ్చిమ గోదావరి జిల్లాలో జరిపిన దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఎనిమిది బస్సులపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్.కృష్ణారావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. ట్రావెల్స్ బస్సులు నడిపే డ్రైవర్లకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ఇకపై రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

- కృష్ణారావు,
జిల్లా రవాణా శాఖాధికారి



నాగమ్మకు పూజలు నాగులచవితి పర్వదినం కావడంతో శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో పుట్టలను సందర్శించి పాలు పోశారు.. 8లో..



అటు విధులు.. ఇటు పూజలు

నాగులచవితి సందర్భంగా ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు విధులకు వెళుతూ.. కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.

ఎన్‌హెచ్ 165కు డీపీఆర్.. అధికారులతో కేంద్ర మంత్రి వర్మ సమీక్ష

భీమవరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధానమైన ఎన్‌హెచ్-165 ఫేజ్-2, నరసాపురం బైపాస్ రోడ్డు పనుల పురోగతిపై కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శనివారం విజయవాడలో సమీక్ష నిర్వహించారు. ఎన్‌హెచ్-165, దిగమర్రు-ఆకివీడు వయా భీమవరం బైపాస్ ప్రాజెక్టు డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్టు(డీపీఆర్) ఖరారు చేసి, ఫైల్‌ను ఢిల్లీకి నేషనల్ హైవే అధికారులు పంపించారు. దీనికి ఫైనాన్స్ క్లియరెన్స్ వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తారు. ఎన్‌హెచ్-165 ఫేజ్-2 ప్రాజెక్టు ప్రాంతంలో ఎక్కువ భాగం నల్లరేగడి మట్టి (బ్లాక్ కాటన్ సాయిల్) ఉన్నందున, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నర్సాపురం బైపాస్ నిర్మాణంలో అడ్డంకిగా వున్న న్యాయపరమైన అంశాల పరిష్కారానికి కొత్త స్టాండింగ్ కౌన్సిల్‌ను నియమించామని అధికారులు మంత్రికి తెలిపారు. తాడేపల్లిగూడెం-భీమవరం మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగు పరచాలని, ఈ దిశగా కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి వీలైన మార్గాలను అన్వేషించాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించారు.



ఆక్వా చెరువులకు సీఏఏ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

భీమవరం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):'ఉప్పు నీటితో సాగు చేస్తున్న ఆక్వా చెరువులను తప్పనిసరిగా కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) కింద రిజిస్టర్ కావాలి. రిజిస్టర్ కాని చెరువులకు చట్టబద్ధత ఉండదు. ఇలాంటి వాటిపై చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన సీఏఏ రిజిస్ట్రేషన్‌కు చేపట్టాల్సిన చర్యలపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'సీఏఏ మార్గదర్శకాలను అనుసరించి బ్రాకిష్ ఆక్వా సాగు చేపట్టాలి. నిబంధనల ప్రకారం సాగుకు గుర్తింపు నమోదు చేయకపోతే చర్యలు తప్పవు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం రూరల్ మండలాల్లో 17 వేల 100 ఎకరాల్లో బ్రాకిష్ ఆక్వా సాగు జరుగుతోంది. 2005 నుంచి 1880 మంది మాత్రమే సీఏఏ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీని కాల పరిమితి ఐదేళ్లు. రెన్యువల్ చేయించుకోకపోవడంతో ప్రస్తుతం వంద మంది మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు. అమెరికా నిబంధనలకు అనుగుణంగా 2026 జూన్ నాటికి అన్ని ఫార్మ్‌లు సీఏఏ పరిధిలో నమోదు కావాలి. అప్పటికీ నమోదు కాని వాటిపై చర్యలు వుంటాయి. మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని 40 మంది నిరుద్యోగ యువతను ఎంపిక చేసి సీఏఏ నమోదులో శిక్షణ ఇప్పించాం. వీరు రైతులకు రిజిస్ట్రేషన్ చేస్తారు' అని తెలిపారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, మత్స్యశాఖాధికారి పి.సురేష్, ఆర్డీవోలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసిరాజు, వ్యవసాయశాఖాధికారి జడ్.వెంకటేశ్వరరావు, ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎన్ రాజు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముంచుకొస్తున్న మొంథా

- నిన్నటి వర్షాలకు తేరుకోక ముందే మరో తుఫాన్
- రైతుల్లో గుబులు.. ఇంకా ముంపులోనే పొలాలు
- చేలకు తెగుళ్లు.. జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు



పెనుగొండ మండలంలో నక్కల డ్రెయిన్ పొంగి చేలలోకి చేరిన నీరు

కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం.. గంటకు వంద కిలోమీటర్ల వేగంతో గాలులు

- అధికారులు అలర్ట్‌గా ఉండాలని ఆదేశాలు..
- ఉద్యోగులకు సెలవులు రద్దు.. కలెక్టర్ సమీక్ష
- సముద్రంలో వేటకు వెళ్లవద్దని ఆదేశాలు
- బీచ్‌లో సందర్శకులకు అనుమతులు రద్దు

భీమవరం టౌన్/రూరల్/నరసాపురం/మొగల్తూరు/పెనుగొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ దూసుకొస్తోంది. ఇప్పటికే మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. శనివారం వాతావరణం కాస్త అనుకూలించిందని ఊరట చెందేలోగా బంగాళాఖాతంలో మొంథా తుఫాన్ తీవ్ర రూపంలో పొంచి వుంది. ఈ ఏడాది ఏర్పడిన తుఫాన్లలో ఇదే అత్యంత ప్రమాదకరమైందన్న వాతావరణ శాఖ హెచ్చరికతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇది తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో తీరం దాటే అవకాశం ఉండటంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలపై దీని ప్రభావం అధికంగా ఉండనుంది. ఈ నెల 28న తుఫాన్ తీరం దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. మూడు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో అధికార యంత్రాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జిల్లా కలెక్టర్ నాగరాణి ఉద్యోగుల సెలవులను రద్దు చేశారు. వైద్యులు అందుబాటులో ఉండాలని, తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

మొంథా తుఫాన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టరేట్, నరసాపురం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లతోపాటు, మొగల్తూరు, నరసాపురం మండల కార్యాలయాల్లోను కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. జిల్లాలో శిథిలావస్థలో వున్న భవనాలు, తీరప్రాంతంలో తుఫాన్ ప్రభావం వున్న ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వేటకు వెళ్లవద్దని ఆదేశాలు జారీచేశారు. భీమవరం, నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగా పునరావాస కేంద్రాలకు తరలించే సన్నాహాలు చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలల్లో వారం రోజులపాటు సరిపడా నిత్యావసర వస్తువులను సిద్ధం చేస్తున్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట్ల ఇసుక బస్తాలు, సర్వే బాదులను సిద్ధం చేశారు. గాలుల కారణం చెట్లు పడిపోతే రవాణాకు ఇబ్బంది లేకుండా వెంటనే వాటిని తొలగించేలా ఏర్పాటు చేశారు. అగ్నిమాపక సిబ్బంది బోట్లు, లైఫ్ జాకెట్లు, మోటారు ఇంజన్లు, ట్రీ కటింగ్ మిషన్‌లను రెడీ చేశారు. తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవలసి చర్యలపై కలెక్టర్ నాగరాణి జిల్లా అధికారులతో సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణ, కలుషిత నీరు అరికట్టేందుకు తీసుకోవాలని చర్యలపై ఆదేశాలు ఇచ్చారు.



వర్షాలతో చేలకు తెగుళ్లు

వర్షాల కారణంగా ముంపునకు గురైన వరి చేలకు తెగుళ్లు సంక్రమిస్తాయని, రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ జేడీ జడ్.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం భీమవరం మండలం బేతపూడి, తుందుర్రు ప్రాంతాల్లోని వరి చేలను పరిశీలించారు. వర్షపు నీరు వరి చేనును ఎంత వరకు ముంపునకు గురిచేశాయన్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువల వివరాలను రైతులను అడిగారు. వారం రోజుల్లో తుఫాను ప్రభావం ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముంపునకు గురైన వరి చేలకు ముడత, పొడతెగులు, ఊచపోటు, కంకి తెగుళ్ల పడతాయని, రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జేడీఏ కొప్పర్తి శ్రీనివాస్, ఏవో ప్రకాష్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

బీచ్‌కు అనుమతి లేదు

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలకు పుణ్య స్నానాలు ఆచరించేందుకు సందర్శకులను ఈ నెల 30వ తేదీ వరకూ అనుమతి లేదని తహసీల్దార్ కె.రాజ్‌కిశోర్ తెలిపారు. 28, 29 తేదీల్లో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం ఆయన విలేకరుల సమావేశంలో చెప్పారు.

రైతుల్లో గుబులు

మొంథా తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో మాసూళ్లు ముమ్మరమయ్యాయి. ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు చేశారు. వచ్చే నెల (మిగతా 8వ పేజీలో)

పొలాలను ముంచేసిన నక్కల డ్రెయిన్

- రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నక్కల డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. పెనుగొండ, మునమర్రు, కొరాలపర్రు గ్రామాల్లోని పంట పొలాలకు సమాంతరంగా ఈ డ్రెయిన్ నీరు చేరడంతో రెండూ ఏకమయ్యాయి. కాలువకు ఎగువ వైపు కాకరపర్రులో లాకులు ఎత్తి వేయడం వల్ల నీరు అధికంగా కిందికి చేరుతోందని అది కింది వైపునకు వెళ్లకుండా పల్లంగా వున్న పొలాల్లోకి నీరు చేరుతుందని చెబుతున్నారు. మరో 24 గంటలు నీటితో ఉంటే పంట చేతికి రానట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డుపైకి పొంగిన కొల్లేరు



కొల్లేరు మళ్లీ ఉప్పొంగుతోంది. ఇటీవల ముంపుతో అతలాకుతలమైన తీర ప్రాంతాలు తేరుకోక ముందే మళ్లీ వరద ముంపు పొంచి వస్తోంది. ఇప్పటికే పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రహదారిపై మూడడుగుల మేర నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాలతో ఒకేసారి ఎగువ నుంచి నీరు వచ్చి చేరడంతో కొల్లేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దఎడ్లగాడి వంతెనకు గుర్రపు డెక్క మేట వేయడంతో వరద నీరు దిగువకు వెళ్లడం లేదు. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు లంక గ్రామాలకు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుమాకలంక నుంచి నాటు పడవలపై పెద్దఎడ్లగాడి వరకు వచ్చి ఏలూరు, కైకలూరు ప్రాంతాలకు వెళుతున్నారు.

రేపు సహకారం బంద్

- తమ డిమాండ్ల పరిష్కరించాలంటూ 'ఛలో విజయవాడ' ఉద్యోగుల ఆందోళన
- విజయవాడ ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నా

నరసాపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):సహకార సంఘాల ఉద్యోగులు ఉద్యమబాట పట్టనున్నారు. పెండింగ్‌లో వున్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఒక రోజు ఆందోళన పట్టనున్నారు. ఆ రోజు జిల్లావ్యాప్తంగా వున్న సహకార సంఘాలను బంద్ చేసి, విజయవాడ ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నారు. దీనికి జిల్లాలోని 254 సొసైటీలకు చెందిన వెయ్యి మంది ఉద్యోగులు, ఇతర సిబ్బంది హాజరు కానున్నారు. ఇప్పటికే మండలాల వారీగా ఉద్యోగులు సమావేశాలు నిర్వహించి, చలో విజయవాడకు పిలుపునిచ్చారు. రైతులకు మెరుగైన సేవలందించడంతోపాటు సొసైటీల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు. అయినప్పటికీ తమ సమస్యలు తీరడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పది నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఒక రోజు ధర్నాకు సమాయత్తం అవుతున్నారు.



ప్రధాన డిమాండ్లు

- 2014లో అప్పటి సీఎం చంద్రబాబు ఇచ్చిన 36 జీవో అమలు, వయో పరిమితి 62 ఏళ్లకు పెంపు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పీఆర్‌సీ అమలు, 2019లో సొసైటీల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. గ్రాట్యూటీ రూ.2 లక్షలు అమలు చేయాలి.

హామీలు నేరవేర్చాలి





- న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పదేళ్లుగా పోరాడుతున్నాం. ప్రభుత్వం అదిగో... ఇదిగో... అంటుందే తప్ప సమస్యలు పరిష్కరించడం లేదు. 2014లో జీవో 36ను అమలు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అది నేటికి నెరవేరలేదు. వైసీపీ ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోలేదు. ఉన్నతాధికారులకు లేఖలు రాసి పరిష్కారం కాలేదు. పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తాం.

- జిల్లా సహకార సంఘం అధ్యక్షులు పి.విజయ భాస్కర్, మాజీ ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసరావు

పెట్రోలు తాగేశారు..!



- ఆర్టీసీ బంకులో ఆర్థిక అవకతవకలు
- ఐదేళ్లలో రూ.83 లక్షలు స్వాహా
- ఏడీసీతోపాటు 14 మందిపై విచారణ పూర్తి
- బాధ్యులపై నేడో, రేపో చర్యలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

ఏలూరు ఏపీఎస్ ఆర్టీసీ ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకులో పనిచేసే దొంగలే అక్రమాలకు తెరతీశారు. ఐదేళ్లలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారు. ఇందులో ప్రధాన సూత్రధారుడిగా సంస్థకు చెందిన అసిస్టెంట్ డిపో క్లర్క్ పాత్ర కీలకమన్న ఆరోపణలున్నాయి. అయనతోపాటు 14 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది అంతా ఏకమయ్యారు. ఖజానాను కొల్లగొట్టారు. రోజుకు రూ.లక్షల్లో బిల్లులకు లెక్క లేకుండా చూపి.. దాదాపు రూ.83 లక్షలు గుటకాయ స్వాహా చేశారు. తీరా అధికారులు నెల రోజులపాటు తనిఖీలు, విచారణలను పూర్తిచేశారు. బాధ్యులపై నేడో, రేపో చర్యలు తీసుకోనున్నారు. ఏలూరు కొత్తబస్టాండ్ ఎదురుగా వున్న ఆర్టీసీ నిర్వహణలో వున్న బంకు 2021లో వైసీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి రవాణా శాఖ మంత్రి పేర్ని నాని చేతుల మీదుగా ప్రారంభమైంది. ఆర్టీసీ డిపో, కార్గో అసిస్టెంట్ మేనేజర్ పర్యవేక్షణ చేయకపోవడంతో ఏడీసీ స్థాయి క్లర్కు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది లక్షల్లో అవకతవకలకు పాల్పడ్డారు. ఇటీవల ఆడిటింగ్ అధికారులు తనిఖీలు చేయగా రూ.83 లక్షల మేర బిల్లులకు లెక్కలు, రశీదులు లేవు. రికార్డుల్లో చూపించిన మొత్తాలకు సంబంధం లేకపోవడంతో ఉన్నతాధికారులు, విజిలెన్స్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఆరా తీయగా ఈ మొత్తాలను గోల్‌మాల్ చేసినట్లు బయటపడింది.

ఫోన్ పే, గూగుల్ పేలతో కొల్లగొట్టారు

2021-2025లో రోజూ బంకులో నగదు జమలు, గూగుల్, ఫోన్ పే మొత్తాలను బిల్లులతో కలిపి రోజూ సంస్థ పేరిట జమ చేయాలి. రోజూ సుమారు రూ.4 లక్షలు నగదు, ఫోన్ పే, గూగుల్ పే కింద రూ.40 వేలు వసూళ్లు జరిగేవి. మర్నాడు నగదులో వేల మొత్తాలను (మిగతా 8వ పేజీలో)



అమృత్-2లో మార్పులు

- పట్టణాలకు తాగునీటి పైపులైన్ ప్రాజెక్టు.. కొత్త ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతి
- జిల్లాకు రూ.672.67 కోట్లు.. తాడేపల్లిగూడెం ఎస్టీపీలకు రూ.88.18 కోట్లు అదనం
- రేపటి నుంచి పనులకు టెండర్లు

భీమవరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు, తాడేపల్లిగూడెం పట్టణాలకు మంచి నీరందించే పైపులైన్ ప్రాజెక్టుకు కొత్త ఎస్ఎస్ఆర్ ధరల ఆధారంగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వాస్తవానికి గతంలోనే అమృత్-2.0లో పైపులైన్ ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు స్పందించ లేదు. అంతలోనే ధరలు మారిపోయాయి. నిర్మాణ వ్యయం పెరిగింది. పెరిగిన ధరలకు అనుగుణంగా నివేదిక పంపాలని ప్రభుత్వం ప్రజారోగ్య శాఖకు సూచించింది. తదనుగుణంగా పైపులైన్ ప్రాజెక్టు (మిగతా 8వ పేజీలో)

నాగమ్మ తల్లీ..

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

నాగుల చవితి పర్వదినం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో వున్న పుట్టల్లో పాలుపోసి కోడిగుడ్లను వేసి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపి ప్రమిదలతో దీపాలను వెలిగించి ఆరాధించారు. పలువురు భక్తులు చెవిపోగులు కుట్టించుకున్నారు. చిన్నారులు బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు.


పెదపాడులో పుట్ట వద్ద భక్తుల పూజలు


అశోక్‌నగర్‌లో స్వామివారు


ఏలూరు బహుగుణ పోలీస్ స్కూల్ పుట్ట వద్ద పూజలు


ఏలూరు పోస్టల్ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల పూజలు


భీమవరం టూటౌన్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..


తాడేపల్లిగూడెంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ఆకివీడులో పుట్ట వద్ద భక్తుల పూజలు


చొదిమెళ్ల సమీపంలో పుట్ట వద్ద పూజలు


టి.నరసాపురంలో నాగేంద్రస్వామికి పాలు పోస్తున్న అయ్యప్ప భక్తులు


పాలకొల్లు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని పుట్ట వద్ద భక్తుల పూజలు


భీమవరం-జువ్వలపాలెం రోడ్డులో వున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు



పుష్కరిణిని సుందరీకరిస్తున్న సిబ్బంది.. విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు

నవంబరు 2న శ్రీవారి తెప్పోత్సవం

▸ ముస్తాబవుతున్న సుదర్శన పుష్కరిణి

ద్వారకాతిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి సుదర్శన పుష్కరిణిలో వచ్చేనెల రెండో తేదీ రాత్రి జరగనున్న స్వామివారి తెప్పోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటివరకు చెత్తాచెదారంతో, తామర తూడుతో నిండి ఉన్న పుష్కరిణిలో గత పది రోజులుగా సిబ్బంది తూడు తొలగించారు. ఉభయదేవేరులతో చిన వెంకన్న పుష్కరిణిలో విహరించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణి చుట్టూ విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణిలోని మురుగునీటిని తొలగించి అందులో పైపుల ద్వారా కొత్తనీటిని నింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉభయ నాంచారులతో కొలువైన శ్రీవారు ఆ రోజు సాయంత్రం తొళక్క వాహనంపై తిరువీధుల్లో ఊరేగి పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అనంతరం జరిగే తెప్పోత్సవ వేడుకను వీక్షించేందుకు భక్తులు తరలిరావాలని ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి కోరారు.

భక్తుల రద్దీ సాధారణం

శ్రీవారి సన్నిధిలో శనివారం భక్తుల సాధారణ రద్దీ నెలకొంది. తుఫాను ప్రభావం, నాగులచవితి పర్వదినం కావడంతో దాదాపు 12 వేల మంది వరకు యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. స్వామివారి దర్శనానికి దాదాపు గంటపైబడి సమయం పట్టింది. కేశ ఖండన శాలలో మొక్కుబడులు తీర్చుకున్న అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్రైం సమాచారం

ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతంతో యువకుడి మృతి


షాలేంరాజు (ఫైల్)

కాళ్ళ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం కాళ్ల మండలం కోపల్లెలో జరిగింది. స్థానికులు తెలిపిన వివారలివి.. గ్రామానికి చెందిన కె.షాలేంరాజు(15) ఫ్లెక్సీ కడుతున్న సమయంలో ఐరన్ ఫ్రేమ్ విద్యుత్ తీగలకు తగిలి మృతికి కారణంగా తెలుస్తుంది. ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉంటున్న తల్లిదండ్రులు కుమారుడి మృతి చెందిన విషయం తెలిసి హుటాహుటిన గ్రామానికి వస్తున్నట్టు వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య

ఆచంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెదమల్లం వద్ద గోదావరిలో దూకి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నెలకొంది. ఆచంట పోలీసులు తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరానికి చెందిన ఎక్స్‌కవేటర్ యజమాని బొలిశెట్టి నరసింహారాజు(46) వారి తాలూకు కుటుంబ ఆస్తులు పంపకాలు చేయడం లేదని మనస్తాపం చెంది శనివారం పెదమల్లం వచ్చి గోదావరిలో దూకేశాడు. ఈ సమాచారం పోలీస్, కుటుంబ సభ్యులకు తెలియడంతో గోదావరిలో సుమారు రెండు గంటల పాటు గాలించగా అతడు విగతజీవిగా లభ్యం అయ్యాడు. మృతుడు భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి : ఎంపీ పుట్టా

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అని పిల్లలు, పెద్దలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ సూచించారు. విజయవాడ అను కార్డియాక్ అండ్ న్యూరో హాస్పటల్స్ సహకారంతో ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత కార్డియాలజీ, న్యూరాలజీ వైద్య సేవలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణతో కలిసి శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించు కోవాలన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మరింత మెరుగైన సేవలకు, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నానన్నారు. ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ ఆసుపత్రికి సీఎస్ఆర్ నిధుల కింద రూ.కోటి విలువైన ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన యంత్ర పరికరాలను అందజేశారన్నారు. ప్రతి శుక్రవారం, మంగళవారం కార్డియాలజీ, న్యూరాలజీ వైద్య సేవల ను ఆసుపత్రిలో వైద్యులు అందిస్తారన్నారు. సమావేశంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, టీడీపీ నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, అను ఆసుపత్రి వైద్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.


ఏలూరులో ఉచిత కార్డియాలజీని ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే బడేటి

అణువణువునా గాలింపు..


▸ విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక టీం
▸ భువనపల్లి వాసుల్లో ఆందోళన
▸ సాధారణ తనిఖీలన్న సీఐ రజనీ కుమార్

నిడమర్రు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మాదకద్రవ్యాలు వినియోగించినా విక్రయించినా కఠినచర్యలు తప్పవని ఈగల్ టీమ్ సీఐ ఎం.రవీంద్ర హెచ్చరించారు. శనివారం భువనపల్లి గ్రామ పరిసర ప్రాంతాలతోపాటు గణపవరం ఇందిరమ్మ కాలనీలో ఈగల్ టీమ్ సభ్యులు కార్డన్ సెర్చ్ (సీఎస్‌వో) నిర్వహించారు. స్థానిక సీఐ రజనీ కుమార్ ఆధ్వర్యంలో విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక ఈగల్ టీమ్ సభ్యులు, సీఆర్పీఎఫ్ దళాలు, జిల్లా పోలీస్ యంత్రాంగం కలిసి అనుమానిత షాపుల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ అణువణువునా గాలించింది. అనుమానితుల ఆధార్ కార్డులను పోలీసులు సేకరించారు. సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ ఈగిల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ శివకిషోర్ ఆదేశాల మేరకు ఈకార్డన్ సెర్చ్ నిర్వహించినట్టు తెలిపారు. తెల్లవారు జామున ఐదు గంటల నుంచే తనిఖీలు ప్రారంభం కావడంతో స్థానికుల్లో భయాందోళనరేకెత్తాయి. తమ గ్రామంలో ఏం జరుగుతుందో తెలియక గందరగోళం తలెత్తింది. డ్రోన్ కెమెరాలు సైతం వినియోగించడం గమనార్హం. సీఐ మాట్లాడుతూ ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లో చైతన్యం కోసం ఇ లాంటి కార్డన్ సెర్చ్‌లు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈగల్ టీమ్ ఎస్ఐలు ఎం.వీరంజనేయులు, ఉదయ్ భాస్కర్, భీమడోలు సీఐ విల్సన్, గణపవరం, నిడమర్రు, ద్వారకాతిరుమల మండలాల ఎస్ఐలు ఎ.ఫణికుమార్, కె.రమేశ్, సుధీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


భువనపల్లిలో తనిఖీలు చేస్తున్న ఈగల్ టీమ్ సభ్యులు

నిర్లక్ష్యం

▸ జుత్తిగ సొసైటీలో దెబ్బతిన్న గోనె సంచులు
▸ రూ.1.60 లక్షల నష్టం
▸ అధికారుల తీరుపై విమర్శల వెల్లువ


జుత్తిగ గోదాంలో ఉన్న గోనె సంచులు

పెనుమంట్ర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని జిల్లా ఉన్నతా ధికారులు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తుంది. పెనుమంట్ర మండలంలోని వ్యవసాయ పరపతి సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. రైతు పండించిన ధాన్యాన్ని తేమ శాతాన్ని నిర్ధారించిన అనంతరం రైతులకు గోనె సంచులను అందించి అవి నిర్దేశించిన రైస్ మిల్లుకు విక్రయానికి తరలించాల్సి ఉంది. గతంలో రైతాంగం ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో పశ్చి గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి పలుమార్లు గోనె సంచెలు సిద్ధం చేసుకోవాలని రెవెన్యూ, రైస్ మిల్లర్లకు, సొసైటీ కార్యదర్శులకు, త్రిసభ్య కమిటీ సభ్యులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఆదేశాలను అమలు కావడం లేదనడానికి పెనుమంట్ర మండలం జుత్తిగ సొసైటీలో గత పంటలో ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్స్ నుంచి గన్ని బ్యాగ్స్‌ను సేకరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచేందుకు నిల్వ ఉంచిన గోనె సంచులు దెబ్బతిన్నాయి. సకాలంలోనే తిరిగి రైస్ మిల్లుకు గోనె సంచులు తరలించాల్సి ఉండగా సొసైటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సహకార సంఘంలో ఒక మూల గోనె సంచులు దర్శనమిస్తున్నాయి. ఈనెల 27న తొలి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు జేసీ సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో శుభ్రం చేసేందుకు సైతం అధికారులు ప్రయత్నించకపోవడం శోచనీయం.

జుత్తిగ సొసైటీలో..

పెనుమంట్ర మండలం జుత్తిగలో లక్ష అరవై వేల రూపాయలు విలువ చేసే 11వేల గోనె సంచులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నష్టం వాటిల్లింది. ఆంధ్రజ్యోతి పరిశీలనలో భాగంగా సోమరాజు ఇల్లిందలపర్రు, మాముడూరు, పొలమూరు, పెనుమంట్ర, ఆలమూరు, తదితర సహకార సంఘాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారుల మధ్య సమన్వయ లోపమా...? కొనుగోలు కేంద్రాల్లో సహకార సంఘం కార్యదర్శి, కొనుగోలు కేంద్రం సిబ్బంది, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారుల సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ చేయాలి. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మిగిలిన సంచులు వెనక్కి పంపించి కొత్త గన్ని బ్యాగ్స్‌ను అందుబాటులో ఉంచాలి.. మండలంలో ఆ పరిస్థితి కనిపించలేదు.

ఒక ఉద్యోగికి రెండు చోట్ల జీతాలా ?

జుత్తిగ సహకారం సంఘంలో పనిచేస్తున్న రమణ సోమరాజు ఇల్లిందలపర్రు సహకార బ్యాంకులో ఇన్‌చార్జిగా విధులు నిర్వరిస్తున్నారు. ఈ ఉద్యోగి సోమరాజు ఇల్లిందలపర్రులో నెలకు రూ.17 వేలు, జుత్తిగ సహకార సంఘంలో సుమారు రూ.20 వేలు జీతం తీసుకుంటున్నట్టు సమాచారం. దీనిపై రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. సహకార సంఘ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బేబీ కిట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి జన్మదిన వేడుకలు

తణుకు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి కూటమి నాయకులు, అభిమానులు తణుకులో పలు సేవా కార్యక్రమాలు, ఆలయాల్లో ఆరిమిల్లి పేరుతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉన్నారు. కూటమి నాయకులు, అభిమానులు రెడ్ క్రాస్ భవనంలో రక్తదానం చేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద అన్నదానం, అన్నక్యాంటీన్‌లో పేదలకు భోజనాలు, సంధ్యాజ్యోతి, మానేపల్లి నారాయణమూర్తి వృద్ధాశ్రమంలోనూ అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, బేబీ కిట్‌లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావుతో పాటు కూటమి నాయకులు మంత్రిరావు వెంకటరత్నం, కలగర వెంకటకృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, బసవా రామకృష్ణ, వంటెద్దు రాజా, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పార్టీ కండువాలు కప్పుతున్న విప్ నాయకర్

వైసీపీకి ఎల్‌బీ చర్లలో భారీ షాక్

సర్పంచ్‌తో సహా మరో వందమంది జనసేనలో చేరిక

నరసాపురం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల పంచాయతీలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. సర్పంచ్ గుబ్బల యమున భాను, వడ్డీకాసులు, బొడ్డు ఆశిష్‌కుమార్, జల్లి నరేష్ వైసీపీకి రాజీనామా చేశారు. వీరంతా విప్ నాయకర్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. వీరితో పాటు మరో వంద మంది వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ 15 నెలల కూటమి పాలన చూసిన తరువాత చాలామంది వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మరికొంత మంది చేరుతారన్నారు. షైలా వసంతరావు, గుబ్బల మార్రాజు, ఆకన చంద్రశేఖర్, కోటిపల్లి వెంకటేశ్వరావు, డి.గంగాధర్, వాతాడి కనకరాజు, సంజీవరావు, బండెల రవీంద్ర పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో పెదవేగి గురుకులం విద్యార్థుల ప్రతిభ

పెదవేగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెదవేగి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకులం విద్యార్థు లు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో రెండు బంగారు, మరో రెండు కాంస్య పతకాలు సాధించి ఉత్తమ ప్రతిభ చాటారు. ఎన్టీఆర్ జిల్లా నున్నలో జరిగిన 19 ఏళ్ల విభాగం రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో మొత్తంగా 18 పతకాలను సాధించారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 19 ఏళ్ల విభాగం జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. సీహెచ్.రాజు 97 కిలోల విభాగంలో, కె.అభిలాష్ 70 కిలోల విభాగంలోనూ బంగారు పతకాలు సాధించారు. 70 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో పి.సంపత్, 86 కిలోల విభాగంలో జె.వినయ్ కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్, పీడీ జయరాజు, ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, నిర్మల అభినందించారు.


విజేతలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ ?

▸ ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఐదు వేల మంది రాయాలని అంచనా !
▸ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కేంద్రం జోక్యం ?

ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లను ఒకింత ఆందోళనకు గురిచేస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరి నిబంధననుంచి మినహాయింపులు వచ్చే అవకాశాలున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్‌ను పలు రాష్ట్రాలు, ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులు దాఖలు చేయగా, దేశవ్యాప్తంగా ఇన్‌సర్వీస్ టీచర్లనుంచి టెట్ మినహాయింపునకు పెద్దఎత్తున డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సీనియర్లకు టెట్ తప్పనిసరిపై ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోనున్నట్టు తెలుస్తోంది. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్‌వల్ల ఎలాంటి అసౌకర్యం కలుగబోదని కేంద్రం భరోసా ఇవ్వడంతోపాటు, అవసరమైతే చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతోన్నట్టు సంకేతాలు వస్తున్నాయి.

● ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌నుంచి మినహాయింపునిచ్చినట్టుగా ప్రభుత్వంనుంచి అధికారిక నిర్ణయమేదీ వెలువడలేదు. ఇదిలా ఉండగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు ఐదు వేలమంది రాయాల్సి ఉంటుందని విద్యాశాఖ ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)పద్ధతిన నిర్వహించే టెట్‌ను డిసెంబరు పదో తేదీన నిర్వహిం చడానికి నోటిఫికేషన్ విడుదలకాగా, గత కొద్దిరోజులుగా ఈ పరీక్షపైనే ఉపాధ్యాయుల్లో విస్తృతచర్చ జరుగుతోంది. విద్యాహక్కు చట్టం అమలుకు ముందు నియమించబడి, ఉద్యోగ విరమణకు ఐదేళ్ల లేదా అంతకంటే ఎక్కువ సర్వీసు మిగిలివున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యా యులంతా టెట్‌లో అర్హత సాధించాల్సిం దేనంటూ సుప్రీంకోర్టు ఇటీవలిచ్చిన తీర్పునకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఈ పరీక్షలో ఉత్తీ ర్ణత సాధించాల్సి ఉంటుంది. దీనికనుగుణంగా 2001 సెప్టెంబరు మూడో తేదీకి ముందు నియమింపబడిన టీచర్లకు టెట్ తప్పనిసరి కాదని చెబుతున్నారు.

పదోన్నతి కోసమే టెట్ !

తాజాగా పదోన్నతి కోసం టెట్ అర్హత సాధించాల్సిందేనని తెలుస్తోంది. ఆ ప్రకారం 2030వ సంవత్సరం ఆగస్టు 31వ తేదీకి ముందు ఉద్యోగవిరమణ చేసేవారు అంటే 1968 ఆగస్టు 31వ తేదీకంటే ముందుగా జన్మించిన వారు టెట్ రాయాల్సిన అవసరంలేదని వివరణిస్తున్నారు. ప్రస్తుతం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇన్‌సర్వీస్ టీచర్లు కచ్చితంగా డిసెంబరులో టెట్ రాయాల్సిందేనని ఆదేశాలెక్కడాలేవని, ఒక అవకాశం కల్పించినట్టుగా మాత్రమే భావించాలని విద్యా శాఖవర్గాలు చెబుతున్నాయి. ఈ పరీక్షను పదోన్నతి కోసం శాఖాపరమైన పరీక్షలు (డిపార్ట్‌మెంటల్ టెస్టు)గా పరిగణించాలని వివరిస్తున్నాయి.

నేడు నరసాపురం ఏఎంసీ ప్రమాణ స్వీకారం

నరసాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నరసాపురం మార్కెట్‌యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం పట్టణంలోని అల్లూరి కళ్యాణ మండపంలో జరగనుంది. దీనికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, రామానాయుడు, సుభాష్‌లు విచ్చేస్తున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరుకానున్నారు.

గంజాయితో ఏడుగురి అరెస్టు

తణుకు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):కొండాలమ్మ పుంత రోడ్డులో గంజాయిని కలిగిన ఉన్న పాలంగి గ్రామానికి చెందిన పాలాడి భాను ప్రకాశ్, అజ్జరంకు చెందిన కాకరపర్తి గణపతి, నల్లాకులవారిపాలెంకు చెందిన పితాని విజయబాబు, తణుకుకు చెందిన గుబ్బల ఉదయ్ ప్రసాదు అలియాస్ ఉదయ్, కాకరపర్తి బాలాజీ, బొడ్డు షారోన్, ఖండెటి సత్యనారాయణ అలియాస్ సత్యలను అరెస్టు చేసినట్టు సీఐ కె.కొండయ్య తెలిపారు. వారి నుంచి 4.350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

వైభవ వెంకన్నకు ప్రత్యేక అలంకరణ



నరసాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):వేములదీవిలో కొలువైన వైభవ వెంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక అలంకరణ చేశారు. నాగులచవితి పండుగను పురస్కరించుకుని స్వామివారికి చెరుకు కర్రల మధ్య శేషనాగు అలంకరణ చేశారు. వేదపండితులు ఆరుణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

ఎమ్మెల్యే ఆరిమిల్లి పేరిట ఆలయాల్లో పూజలు



వేల్పూరులో పూజలు చేసిన ఎమ్మెల్యే రాధాకృష్ణ తండ్రి చక్రధరరావు

తణుకు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి):తణుకు ఎమ్మె ల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పుట్టిన రోజు సందర్భ ంగా తణుకు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పూరులోని రుద్రేశ్వర, వీరభద్ర మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆరిమిల్లి రాధాకృష్ణ తల్లిదండ్రులు వెంకట లక్ష్మీ, చక్రధరరావు, సర్పంచ్ వి.కృష్ణవేణి, ఉప సర్పంచ్ రాజారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వల్లూరి రామ్మోహనరావు పాల్గొన్నారు. మండపాక యల్లారమ్మ ఆలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, రఘురామ చౌదరి, సొసైటీ చైర్మన్ పీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దువ్వలోని దానేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పత్తి రామకృష్ణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు పూజలు చేశారు.

ఇరగవరం: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పుట్టినరోజు వేడుకలు శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో కూటమి నాయకులు కేకును కట్‌చేసి ఎమ్మెల్యే రాధాకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. మండల టీడీపీ జనరల్ సెక్రటరీ పోతిరెడ్డి శ్రీనివాస్, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ మండల జనసేన అధ్యక్షులు ఆకేటి కాశీ, ఆకేటి నరసింహారావు, తహసిల్దార్ సుందరరాజు, ఎంపీడీవో శ్రీనివాసు పాల్గొన్నారు.

జిల్లాలో గంజాయి నిర్మూలించాలి

భీమవరం క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి అనే మాట వినిపించకూడదు, యువత విద్యార్థులు గంజాయి ఆకర్షణకు లోను కాకుండా చూసే బాధ్యత ఎక్సైజ్ అధికారులు తీసుకోవాలని, తనిఖీలు ముమ్మరం చేసి గంజాయి నిర్మూలనకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు.

రిటైల్ పెట్రోల్ బంకు మంజూరు చేయాలని వినతి

ఆచంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఆచంట సొసైటీకి మంజూరు కాబడిన కన్స్యూమర్ పెట్రోల్ బంక్ స్థానంలో రిటైల్ పెట్రోల్‌బంక్ మంజూరు చేయాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ నాగరాణికి సొసైటీ చైర్మన్ కడలి భాస్కరరావు, సభ్యులు బలుసు శ్రీరామమూర్తి, తోరం ప్రసాద్‌తో పాటు కార్యదర్శి వేంద్ర విష్ణు వినతిపత్రం అందజేశారు.



పాలకొల్లులో క్షీరా రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు.. మొగల్తూరులో మోకాలు లోతు నీటిలోకి దిగి పుట్టలో పాలుపోస్తున్న భక్తులు.. పడమరవిప్పర్రులో అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి.. రావిగొప్పలో నవ నాగులకు అభిషేకాలు

నాగమ్మా.. దీవించమ్మా

ఘనంగా నాగుల చవితి వేడుకలు.. పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్న భక్తులు

'తోక తొక్కితే తొలగిపోయి, నడుం తొక్కితే నా వాడనుకుని, పడగ తొక్కితే పారిపో నాగమ్మ' అని భక్తులు చెప్పుకుని పుట్ట మట్టి తీసుకుని చెవులకు, కళ్ళకు రాసుకున్నారు. నాగుల చవితి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. భక్తులు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆకివీడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితిని భక్తులు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. భక్తులు తెల్లవారుజామునే దగ్గరలో ఉన్న పుట్టల దగ్గరకు వెళ్ళి పాలు, కోడి గుడ్లు తదితర వాటిని వేసి మొక్కులు తీర్చుకున్నారు.

నరసాపురం టౌన్/మొగల్తూరు: పట్టణంలోని శివాలయం, రుస్తుంబాదాలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద తెల్లవారుజాము నుంచి భక్తుల సందడి కనిపించింది. థామస్ వంతెన, లాకుల వద్దనున్న పుట్టల వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లిఖితపూడి, సారవ, చినమామిడిపల్లి, ఎల్‌బిచర్ల గ్రామాల్లోని పుట్టలు, సుబ్రహ్మణ్యే శ్వరస్వామి ఆలయం వద్ద పాలు పోసి పూజలు నిర్వహించారు. మొగల్తూరు మండలంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

పెనుగొండ/ఆచంట: పెనుగొండ, మునమర్రు, కొఠాలపర్రు, సిద్దాంతం, వడలి, వెంకట్రాయపురం, ఆచంట మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు పుట్టల వద్దకు వెళ్ళి పూజలు నిర్వహించారు. పుట్టలలో పాలు, తేగలు, గుడ్లు, వంటివి వేసి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు.

కాళ్ల: కాళ్ల, కోలనపల్లి, బొండాడ, జక్కరం, కాళ్ళకూరు, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కోపల్లె, పెద అమిరం, సీసలి తదితర గ్రామాల్లో వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సమేతంగా సమీపంలోని పుట్టవద్దకు చేరుకున్నారు. పుట్టలో పాలు వేసి పిండి పదార్థాలను వేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు.

పెంటపాడు:పడమరవిప్పర్రులో వల్లీదేవసేన సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామి పుట్టలో భక్తులు పాలు పోసుకునే విధంగా నిర్వాహకులు పైపులను ఏర్పాటు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెంటపాడులో రైతు కాటన్ క్లబ్ మాజీ అధ్యక్షుడు దివంగత నల్లమిల్లి వీరరాఘవరెడ్డి ఏర్పాటు చేసిన పుట్టవద్ద భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. ఏర్పాట్లను రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయ్ ఆనందరెడ్డి పర్యవేక్షించారు.

తాడేపల్లిగూడెం:పంపుల చెరువు చుట్టూ పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. దీంతో పాటు కొండాలమ్మగుడి రోడ్డు, దానమ్మగుడి రోడ్డు, కుంచనపల్లిరోడ్డు, తాళ్లముదునూరుపాడు, కడకట్ల, 17వార్డులోని పుంతల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పుట్టల్లో పాలు, గుడ్లు వేశారు.

భీమవరం టౌన్: పట్టణంలోని శ్రీరాంపురంలో ఉన్న రామలింగేశ్వరస్వామిఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు చేశారు. భక్తులు స్వయంగా పాలుపోసుకునే అవకాశం ఉండటంతో భక్తులు క్యూకట్టారు. భీమేశ్వరస్వామి ఆలయంలోని నాగేంద్ర స్వామి ఆలయంలోను, సోమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి పాలు పోసుకున్నారు. కొంత మంది తమ పిల్లలను పుట్ట వద్ద ఉంచి బూరెలు పోసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గణపవరం:పుట్టలో ఆవుపాలు పోసి నాగపూజ చేసి చలిమిడి, చిమిలి, అరటిపండ్లు, తాటి, బుర్ర గుంజులు, తేగలు వంటివి నివేదించారు. అత్యధిక శాతం మహిళలు పుట్టవద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి దీపావళినాడు మిగిలిన మతాబులు, కాకర పువ్వొత్తులు, టపాసులు కాల్చారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు మండల గ్రామాల నుంచి పెద్దఎత్తున పాల్గొన్నారు.

పోడూరు:గుమ్మలూరు శివారు రావిగొప్పు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ంలో నాగుల చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని నాగబంధం సహిత నవ నాగులకు పాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. కుజదోష, సర్పదోష, కాలసర్పదోషాలు తొలగి వివాహాలు, సంతానాభివృద్ధి, ఆయుష్షు, ఆరోగ్యం చేకూరాలని 108మంది దంపతులు ఏకాదశ రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లీలా కల్యాణం నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని సుబ్బారాయుడు గుడివద్ద, శంభేశ్వర స్వామి గుడి, నాగరాజు పేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, కనక దుర్గమ్మ ఆలయం, లాకుల వద్ద పుట్ట, పెనుమదం రోడ్డు ఇలా పలు ప్రాంతాల్లో పుట్టల వద్ద పాలు పోశారు. చిన్నారులు బాణసంచాలు కాల్చి సందడి చేశారు. నాగుల చవితిని పురస్కరించుకుని పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం కిటకిటలాడింది. వేకువ జాము నుంచి భక్తుల వచ్చి స్వామివారిని దర్శించుకుని, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ఆవు పాలతో అభిషేకాలు చేసుకున్నారు. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భక్తుడు గాదె వెంకన్న ఆర్థిక సహాయంతో సుమారు 2500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్‌వీ రమణ మూర్తి దంపతులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నరసాపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర కాలేజీలో డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థి దశలో కాలేజీ చదువులు గోల్డెన్‌డేస్ అన్నారు. కొంత మంది విద్యార్థులు గంజాయ్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని జెబీరా స్కూల్ హాస్టల్‌లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. చైర్మన్ కె.సత్యనారాయణ, కోశాధికారి త్రినాధ్, డైరెక్టర్ శ్రీహరి, సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై నాగలక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

తాడేపల్లిగూడెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన దశలవారీ ఆందోళనా కార్యక్రమాలలో భాగంగా ఏఐటీయూసీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ శనివారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. నవంబరు 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెకు సన్నాహకంగా మున్సిపల్ కార్మికులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓవీరాజు, మునిఇపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, అల్లం కుమారస్వామి, కొడమంచిలి చంద్రరావు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికలు అప్పగింత

తణుకు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):ఈనెల 20వ తేదీన తేతలి గ్రామంలో అదృశ్యమైన బాలికను ఆకివీడు రైల్వే స్టేషన్‌లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తాడేపల్లిగూడెం డీఎస్పీ డి విశ్వనాథ్ తెలిపారు. శనివారం తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన సంచార జాతులకు చెందిన బాలిక తల్లిదండ్రులు ధనకొండ ఏసు, ఏసమ్మలు తేతలి గ్రామంలో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని గంగిరెద్దులు తిప్పుకుంటూ జీవిస్తున్నారు. ఈనెల 20వ తేదీన ఏసమ్మ, ఏసులు బిక్షాటన కోసం గ్రామంలో తిరుగుతూ వుండగా వారి కుమార్తె దనకొండ వీరమ్మ (5) బాలిక కనిపించడంలేదని కుటుంబ సభ్యులు తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరోజు బాలిక తేతలి జాతీయ రహదారిపైకి చేరుకుని అక్కడి నుంచి ఆటో ఎక్కి తణుకు ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు చేరుకున్నట్లు తెలిపారు. అక్కడ బిక్షాటన చేస్తున్న వారు బాలికను ఆకివీడు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు దర్యాప్తులో బాగంగా ఈనెల 24వ తేదీన ఆకివీడు రైల్వే స్టేషన్‌లో పోలీసులు బాలికను గుర్తించినట్లు తెలిపారు. బాలికలను తీసుకెళ్లిన దంపతులు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకెళ్లలేదని గుర్తించిన పోలీసులు బాలికను సురక్షితంగా ఆ దంపతుల నుంచి తీసుకువచ్చి తల్లిదం డ్రులకు అప్పగించారు.

తణుకు: ఉండ్రాజవరం మండలం వడ్దూరు గ్రామానికి చెందిన బాలిక అవల జ్యోతి కనిపించక పోయిన కొద్ది గంటల్లో పట్టణ పోలీసులు బాలికను పట్టుకున్నారు. జ్యోతి తల్లి దానమ్మతో కలిసి తణుకు వచ్చి బాలికను వెంకటేశ్వర సెంటర్‌లో పక్కన కూర్చోపెట్టి తల్లి యాచక వృత్తికి వెళ్ళి చేస్తుండగా మధ్యాహ్నం సమయంలో కనిపించలేదని పట్టణ పోలీసులుకు తల్లి దానమ్మ ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాలు పరిశీలించి పెరవలి వైపు ఆటోలో వెళుతున్నట్లు గుర్తించి, పాలకొల్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాలకొల్లు పట్టణ కానిస్టేబుల్ గుబ్బల మురళీ సహాయంతో బాలికను పట్టుకొని తల్లికి అప్పగించారు. బాలికను వెంటనే పట్టుకోవడానికి కృషి చేసిన పట్టణ ఎస్ఐ శ్రీనివాసు, క్రైమ్ సిబ్బంది సత్యనారాయణ, రవి, అక్బర్‌లాల్, వెలగేశ్వరరావులను సీఐ కొండయ్య అభినందించారు.



పాలకొల్లులో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల.. తాడేపల్లిగూడెంలో తుఫాన్ జాగ్రత్తలపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. గణపవరంలో బొబ్బిలి వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులతో పాటు, సంక్షేమ పథకాలను ఏకకాలంలో చేపడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని జలవ నరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో రూ.1.50 కోట్లతో నిర్మించ నున్న ప్రధాన రహదారి (ఆర్‌అండ్‌బి) పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ 2019లో వైసీపీకి ఎందుకు ఓటు వేశాం అని ప్రజలు ఆలోచించాలని, ఐదు ఏళ్లలో అభివృద్ధి, సంక్షేమం అనేవి పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కోడి విజయభాస్కర్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరు నాయుడు, ఉన్నమట్ల కపర్ది పాల్గొన్నారు.

తుఫాన్‌కు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయిన్లు, ఇతర విభాగాలకు చెందిన అధికారులతో శనివారం సమీక్షించారు. ముఖ్యంగా రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముందస్తుగా పొలాల్లో ఉన్న నీటిని బయటకు తీసివేయాలని కోరారు. తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయం, పెంటపాడులోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంలోను, మాదవరంలో కూడా ప్రత్యేక కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసి సమీక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎర్రకాలువ పరిస్థితిని గమనిస్తూ రైతులను అప్రమత్తం చేయాలని కోరారు. ఈనెల 26 నుంచి 29వ తేది వరకు దీని ప్రభావం జిల్లాపై ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిందన్నారు.

బొబ్బిలి వంతెనకు మరమ్మతులు చేస్తాం

గణపవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న బొబ్బిలి వంతెనకు మరమ్మతులు చేస్తామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. శనివారం గణపవరం బొబ్బిలి వంతెనను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలి ంచారు. శిథిలమైన పుట్‌పాత్, విరిగిన సైడ్‌వాల్స్, వంతెన స్లాబును పరిశీలించారు. పుత్‌పాత్‌పై పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడటం వలన ఆ రంధ్రాల నుంచి పలువురు కాల్వలో పడిన తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ జేఈ రవికుమార్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, గణపవరం, నిడమర్రు మండలాల జనసేన అధ్యక్షులు తోట శ్రీనివాసరావు, నిమ్మల దొరబాబు, గణపవరం, కాశీపాడు సొసైటీ అధ్యక్షులు కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు, కొలనువాడ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నేలవాలిన పంటలపై సస్యరక్షణ చేపట్టాలి

తణుకు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):భారీ వర్షాల కారణంగా నేలవాలిన వరి పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. శనివారం మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, తెగుళ్ల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి. భువనేశ్వరి, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గిరిజారాణి, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ మల్లికార్జునరావు దువ్వ, తేతలి గ్రామాల్లో మినీకిట్లు పంపిణీ చేసిన వరి పొలాలను పరిశీలించారు. వరి పంటలో ఈనిక దశలో వర్షాలు కురవడం వలన మాని పండు తెగులు వచ్చే అవకాశం వుందని దీని నివారణకు ప్రొపికొనాజోల్ అనే సిలీంధ్ర నాశనిని లీటరు నీటికి 1 మిల్లీ లీటరు మందును కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈనాలుగు రోజుల్లో కురిసిన వర్షాలకు నేల వాలిన పంట చేలలో నీరు నిలవకుండా చూసుకోవాలని సూచించారు.

తుఫాన్‌పై ముందస్తు చర్యలు తీసుకోవాలి

అత్తిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై ముందస్తు చర్యలలో భాగంగా వివిధ శాఖల అధికారులతో అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ సమావేశాన్ని నిర్వహించారు. సోమ,మంగళ, బుధవారాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందస్తుగా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. బాలింతలు ఉంటే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. అధికారుల సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ముంచుకొస్తున్న మొంథా

(5వ పేజీ తరువాయి)

మొదటి వారం నుంచి జిల్లాలో మాసూళ్లు సాగుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జిల్లాలో వెన్ను పాలు పోసుకుంటున్నాయి. కొన్ని మండలాల్లో రంగు మారుతున్న సమయంలో మూడు రోజులుగా వర్షాలతో చేలు నేల వాలాయి. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో కొన్నిచోట్ల పంట పొలాల్లో నీరు బయటకుపోలేదు. ఈ తరుణంలో మరో మూడు, నాలుగు రోజులు వర్షాలు కురిస్తే చేతికొచ్చిన పంట మొత్తం నాశనం అయిపోతుందన్న భయం రైతుల్లో నెలకొంది.

పెట్రోలు తాగేశారు..!

(5వ పేజీ తరువాయి)

చేతివాటం ప్రదర్శించి.. ఫోన్ పే లావాదేవీల పాత బిల్లులను ఆ మొత్తాలతో భర్తీ చేసి నిధులు స్వాహాకు తెరతీశారు. ఇలా ఏళ్ల తరబడి చేతివాటం ప్రదర్శించారు. ఇందులో ఏడీసీ పాత్ర కీలకంగా వుందని చెబుతున్నారు. అతని సొంత బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు ఏ విధంగా జరిగాయో ఆరా తీస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని చెబుతున్నారు. బంకు లావాదేవీలు పర్యవేక్షించాల్సిన వారు తమ ఉద్యోగాలు కోల్పోతామన్న భావనతో కొన్ని లక్షలను సంస్థకు జమ చేసినట్లు తెలిసింది. బంకు లావాదేవీలపై ఏటా సంస్థ అధికారులు తప్పనిసరిగా ఆడిట్ చేయాలి. అది చేయలేదు. గతంలో పనిచేసిన డీఎంలు, ఇతర పర్యవేక్షణాధికారులను విచారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో అసలు సూత్రధారులెవరో ఉన్నతాధికారులు బాధ్యులపై తీసుకునే చర్యలతోనే బయట పడుతుందని చెబుతున్నారు. ఈ విషయంపై డీపీటీవో షేక్ షబ్నం మాట్లాడుతూ అవకతవకలపై సంస్థ బాధ్యులు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

అమృత్-2లో మార్పులు

(5వ పేజీ తరువాయి)

పనులలో మార్పులు, చేర్పులు చేస్తూ ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని ఆమోదిస్తూ ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం నుంచి టెండర్లు పిలవనున్నారు. అలాగే తాడేపల్లిగూడెం మునిసిపాల్టీలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నిర్మాణానికి రూ.88.18 కోట్లు ప్రత్యేకంగా మంజూరు చేసింది. వీటికి టెండర్లు పిలవనున్నారు. ఇవి పూర్తయితే తాడేపల్లిగూడెంలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో వున్న భూగర్భ డ్రైనేజీకి మోక్షం లభిస్తుంది.

మంజూరైన నిధులు(రూ.కోట్లలో)

భీమవరం	157.72
నరసాపురం	125.92
పాలకొల్లు	119.26
తణుకు	118.11
ఆకివీడు	76.34
తాడేపల్లిగూడెం	75.32
మొత్తం	672.67

వదలని వాన

ముంచుకొస్తున్న తుఫాన్‌తో రైతుల ఆందోళన



ఆకివీడులో పడుతున్న వర్షం

ఆకివీడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం శనివారం దంచికొట్టింది. ఉదయం ఎండ, మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ఎడతెరిపి లేకుండా మూడ్రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రజానీకం అల్లాడుతుంది. కురుస్తున్న వర్షాలతో పాటు కాలువలకు నీరు చేరడంతో పొంగిపొర్లుతున్నాయి. చినకాపవరం మురుగుకాల్వ సమతానగర్ పాత వంతెన దగ్గర పొటెత్తడంతో సమీపంలో ఉన్న ఇళ్లలోకి నీరు చేరింది.

మొగల్తూరు:వారం రోజులుగా మండలంలో సుమారు 221.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మొగల్తూరు పరిధిలో 618 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టగా ముందుగా జూన్, జూలై నెలల్లో 150 ఎకరాలు మాత్రమే ఊడ్చారని మిగిలిన 468 ఎకరాల్లో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నాట్లు వేయడం పూర్తయ్యిందని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. గత వారం రోజుల వర్షం ప్రభావంతో ముందుగా ఊడ్చిన చేలల్లో 15 నుంచి 20 ఎకరాల్లో చేలు నేల వాలాయని అంచనా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. నేలరాలిన, ముంపులో ఉన్న చేలల్లో ఎకరాకు 150 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లోనూ వర్షం నీరు నిలిచిపోవడంతో రహదారులు ఛిద్రంగా మారాయి. తుఫాన్ ఈనెల 28, 29 తేదీల్లో తీరం దాటే అవకాశం ఉందని ఈలోపుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

ఉండి: బొండాడ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. నాలుగురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఉండి, వెలివర్రు, పాములపర్రు, యండగండి మీడియం డ్రెయిన్‌లోని నీరు బొండాడ డ్రెయిన్‌లోకి వెళ్లి కలుస్తాయి. దాంతో ఈడ్రెయిన్ ఉధృతంగా ఉన్నది. పాములపర్రులోని కొండగూడెం నుంచి ఉండి మీదుగా, వాండ్రం, కాళ్ల మండలం కోపల్లె తదితర గ్రామాలు మీదుగా ప్రవహిస్తోంది. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ వర్షాలకు నీరు చేరిపోయి మునిగిపోయింది. సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జి, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి తదితరులు ఈప్రాంతాన్ని పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌తో చెత్తను, డ్రెయిన్లను అభివృద్ధి పరిచారు.

